7
సాక్షి
విశాఖపట్నం
మంగళవారం । 28 । జనవరి । 2025



సహాయకులతో వస్తున్న అంధులు



● అంధులపై కక్ష

దేవుడా.. ఏమిటీ పరీక్ష



ఆస్పత్రి వద్ద అంధుల పడిగాపులు

- పరీక్షల పేరుతో తీవ్ర ఇబ్బందులు
- ప్రభుత్వం తీరుతో ఆందోళన చెందుతున్న బాధితులు

దివ్యాంగులపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టింది. పింఛన్ల పెంపు హామీని నిలబెట్టుకోలేక కనీసం మానవత్వం మరిచి ప్రవర్తిస్తోంది. మొన్న మంచాన పడ్డ వారికి.. నిన్న మానసిక రోగులకు చుక్కలు చూపించింది. నేడు సదరం సర్టిఫికెట్ల పునఃపరిశీలన అంటూ అంధులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. సోమవారం ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆస్పత్రిలో అంధులు పడిన పాట్లు ఆవేదన కలిగించింది.

– మహారాణిపేట



భీమిలికి చెందిన ఓరుగంటి రవి

చాలా ఇబ్బంది పడ్డాం

నా కుమారుడు రవికి నూరు శాతంతో సదరం సర్టిఫికెట్ ఇవ్వాలి. కాని తక్కువ శాతం వేసి నెలకు రూ.6 వేలు ఇస్తున్నారు. పుట్టుకతోనే కళ్లు కనబడవు. మాటలు రావు. ఏ పని చేయలేడు. ఆకలి కూడా తెలియదు. తినిపిస్తేనే తింటాడు. ఇంత ఇబ్బందుల్లో ఉన్న రవిని పరీక్షల కోసం ఆస్పత్రికి రమ్మని నోటీసు ఇచ్చారు. భీమిలి నుంచి వ్యయప్రయాసలతో ఇక్కడకు వచ్చాం. రవి ఎక్కువ సేపు నిలబడి ఉండలేడు. ఎక్కువ సమయం మంచంపైనే పడుకుని ఉంటాడు. దీంతో చాలా ఇబ్బందులు పడ్డాం.

– ఓరుగంటి వరలక్ష్మి, అంధుడు రవి తల్లి, భీమిలి



సహాయకులతో వస్తున్న అంధులు

మళ్లీ ఇప్పుడు పరీక్షలెందుకు?

సదరం సర్టిఫికెట్ల పునఃపరిశీలన కోసం రేసపువానిపాలెంలోని ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆస్పత్రిలో అంధ పింఛన్‌దారులకు సోమవారం పరీక్షలు నిర్వహించారు. 'కంటి సమస్యలు ఉండడంతో దివ్యాంగుల కోటాలో పింఛను తీసుకుంటున్నాం. ఇప్పుడు మళ్లీ పరీక్షలు చేయాలట.. మళ్లీ తమ అంధత్వాన్ని నిర్ధారించాలట. ఎప్పుడు ఇలాంటి పరిస్థితి చూడలేదని పరీక్షల కోసం వచ్చిన దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేశారు. పింఛను ఉంచుతారో.. తీసేస్తారోనని భయంగా ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. ఇదిలావుండగా తొలిరోజు 100 మందికి ఒకే కౌంటర్‌లో సదరం సర్టిఫికెట్లు పరిశీలించి, అక్కడే వైద్య పరీక్షలు చేపట్టారు.



కంటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

అతికష్టంగా తీసుకొచ్చాం

శ్రావణి అక్కయ్యపాలెంలో నివాసముంటుంది. ఆమెకు కళ్లు కనిపించవు. ఎవరి సాయం లేనిదే ఇంట్లో కూడా శ్రావణి నడవలేదు. కుటుంబ సభ్యులు ఆమెను కంటికి రెప్పలా చూసుకుంటున్నారు. అంధత్వ పరీక్షలు చేయాలంటే ఆస్పత్రికి అతికష్టంగా తీసుకొచ్చాం. ఇప్పటికే పెన్షన్ అందుకుంటున్న శ్రావణికి మళ్లీ పరీక్షలు నిర్వహించడం ఎందుకో అర్థం కావడం లేదు. ఇలా ఇబ్బందులకు గురిచేయడం ప్రభుత్వానికి తగదు.

– అంధురాలు శ్రావణితో వచ్చిన బంధువులు

సిబ్బంది తీరుతో అవస్థలు

ఎక్కువ సంఖ్యలో రోగులను పిలిచి తక్కువ కౌంటర్లు ఏర్పాటు చేయడంతో అంధులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. తరచూ కంప్యూటర్‌లో ఆన్‌లైన్ ఇబ్బందులు రావడం వల్ల చాలా సేపు వేచి ఉండాల్సి వచ్చింది. అంధులకు పరీక్షలు చేసే ప్రక్రియలో సిబ్బంది ఇబ్బందులకు గురి చేశారు. కంటిని లాగడం, కంట్లో సెల్‌ఫోన్ లైటింగ్ వేయడంతో రోగులు, వారి సహాయకులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.



ప్రాంతీయ కంటి ఆస్పత్రికి సహాయకులతో వచ్చిన అంధులు

నేటి నుంచి ఖైదీల తరలింపు

రాజమండ్రికి రోజుకు 30 మంది చొప్పున 200 మందిని పంపించేందుకు ఏర్పాట్లు

ఆరిలోవ : విశాఖ కేంద్ర కారాగారం నుంచి ఖైదీలను వేరే జైలుకు తరలించే ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభంకానుంది. వారం రోజులపాటు ఈ ప్రక్రియ కొనసాగనుంది. ఈ కారాగారంలో ఉన్న బేరక్‌లను బట్టి ఖైదీల సామర్థ్యం 914 మంది. సోమవారం నాటికి 2,006 మంది ఖైదీలున్నారు. కొన్ని సంవత్సరాల నుంచి గంజాయి ముద్దాయిలతో నిండిపోయిన ఈ జైలులో సుమారు 2,000 మందికిపైగా ఉంటున్నారు. దీనివల్ల ఇక్కడ ఖైదీలకు ఆహారం సరఫరా, వాడుక నీరు, పారిశుధ్య నిర్వహణలో సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో ఈ సమస్యలను కొంతవరకు పరిష్కరించాలనే ఆలోచనతో జైళ్ల శాఖ ఉన్నతాధికారులు వేరే జైలుకు కొందరు ఖైదీలను తరలించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఇక్కడ నుంచి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి 200 మంది శిక్షపడిన ఖైదీలను తరలించడానికి అనుమతులు పొందారు. ఆ ఖైదీలను తరలించడానికి పోలీస్ బందోబస్తు అవసరం కావడంతో జైల్ అధికారులు పోలీసుల సహకారం తీసుకొంటున్నారు. మంగళవారం నుంచి ప్రత్యేక వ్యానుల్లో ఖైదీలను తరలించనున్నట్లు జైల్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఎస్.సాయిప్రవీణ్ తెలిపారు. రోజుకు 30 మంది చొప్పున ఖైదీలను తరలించనున్నామన్నారు. పోలీస్ ఎస్కార్ట్‌తో వారిని తరలిస్తామని తెలిపారు. వీరిని తరలించడం ద్వారా ఖైదీల సంఖ్య కొంతవరకు తగ్గుతుందన్నారు.

ఒకే ఊరిలో ఇద్దరు ఆత్మహత్య



ఆదిత్య (ఫైల్)



లక్ష్మి (ఫైల్)

పద్మనాభం : మండలంలోని కృష్ణాపురంలో సోమవారం వేర్వేరు చోట్ల ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన తీవ్ర సంచలనం సృష్టించింది. ఒకరు వివాహిత, ఇంకొకరు యువకుడు. అతనికి ఇంకా వివాహం కాలేదు. దీనికి సంబంధించి సీఐ సీహెచ్ శ్రీధర్ అందించిన వివరాలిలా ఉన్నాయి. కృష్ణాపురం గ్రామానికి చెందిన కనకల లక్ష్మి(31) తన ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని మృతి చెందగా.. అదే గ్రామానికి చెందిన మొకర ఆదిత్య(21) స్ప్రింగ్ ఫీల్డ్ పాఠశాల వెనుక ఉన్న షెడ్‌లో చీరతో ఉరివేసుకొని మృతి చెందాడు. వీరి మధ్య కొన్నాళ్లగా వివాహేతర సంబంధం ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. మృతుడు ఆదిత్య తండ్రి రవి, మృతురాలు లక్ష్మి భర్త శంకర్ ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఒక్కగానొక్క కొడుకు

మొకర రవి, జానకి దంపతులకు ఆదిత్య ఒక్కగానొక్క కొడుకు. విశాఖ నగరంలో ఉద్యోగం చేస్తున్నాడు. కొడుకు మృతితో తల్లి దండ్రులతో పాటు కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు.

తల్లి ప్రేమను కోల్పోయిన చిన్నారులు

కనకల శంకర్, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు. వీరిలో తేజేష్ 4వ తరగతి, ధను 2వ తరగతి చదువుతున్నారు. లక్ష్మి మృతితో ఇద్దరు చిన్నారులు తల్లి ప్రేమకు దూరమయ్యారు. తల్లి మృతదేహం వద్ద ఈ చిన్నారులు బిక్కుబిక్కుమంటూ చూస్తున్న చూపులు అందరిని కలచివేశాయి.



తల్లి ప్రేమకు దూరమైన చిన్నారులు

రుషికొండలో టికెట్ దందా

ఏపీ టూరిజం ఆదాయానికి భారీ గండి



సాయంత్రం 5 గంటలకు వెళ్తే మధ్యాహ్నం 3.29 గంటల సమయంతో ఇచ్చిన టికెట్

ప్రముఖ పర్యాటక కేంద్రం రుషికొండ **బీచ్‌లో పర్యాటక శాఖ** ఆదాయానికి గండి పడుతోంది. **ఒకే టికెట్‌ను మళ్లీ మళ్లీ** వినియోగిస్తూ.. పర్యాటకుల **నుంచి వసూలు చేసిన ప్రవేశ రుసుము నిర్వాహకుల జేబులోకి చేరుతోంది. రోజూ వందల సంఖ్యలో వచ్చే** పర్యాటకుల ద్వారా ప్రతి నెలా రూ.లక్షల్లో దోపిడీకి పాల్పడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కొమ్మాది: రుషికొండ బీచ్‌వద్ద కొత్తగా ప్రారంభించిన సాత్ రోడ్డులో మీ కారు పార్కింగ్ కోసం ఇచ్చిన టికెట్‌పై సమయం మీరెప్పుడైనా గమనించారా? మీరు వచ్చిన సమయానికి... టికెట్ జారీ చేసిన సమయానికి తేడా ఉండటం ఇట్టే పట్టేయవచ్చు. మీరు ఇచ్చిన రూ.50కు సరైన సమయానికి టికెట్ ఇవ్వాలని కోరితే ఏం చేసుకుంటారో చేస్కోండి అని దురుసుగా సమాధానాలు వస్తాయి. నిత్యం వందల్లో వచ్చే వాహనాల నుంచి రూ.వేలల్లో వసూలైన మొత్తం టూరిజం ఖజానాకు కాకుండా అక్కడి ఉద్యోగులు, అధికారుల జేబుల్లోకి వెళ్లిపోతోంది. అక్కడ డ్యూటీ దక్కాలన్నా.. టూరిజం అధికారులకు కొంత మొత్తం చెల్లించాల్సిందే. గత కొద్ది రోజులుగా భారీగా వస్తున్న పర్యాటకుల తాకిడిని వీరు సొమ్ము చేసుకుంటున్నట్లు విమర్శలు ఉన్నాయి. ప్రధానంగా రుషికొండ బీచ్ మేనేజర్ కనుసన్నల్లోనే మొత్తం వ్యవహారం నడుస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

టికెట్ ఒక్కటే.. రాకపోకలెన్నో..! : బీచ్ రోడ్డు నుంచి రుషికొండ బీచ్ వ్యూ పాయింట్‌కు వెళ్లేందుకు ముందుగా రూ.50 టికెట్ తీసుకోవాలి. ఆ టికెట్‌ను కేవలం ఒక్కసారి మాత్రమే ఉపయోగించాలి. కానీ ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా నిర్వాహకులు పలుమార్లు దాన్ని వినియోగించి, ఏపీ టూరిజం ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు. వాహనం ఏ సమయానికి వెళ్తే అదే సమయానికి టికెట్ ఇవ్వాలి. కానీ ఇక్కడ ఏ టైమ్‌కు వెళ్లినా ఆ సమయానికి సుమారు 2–3 గంటల తేడాతో నమోదు చేస్తున్నారు. బీచ్ నుంచి తిరుగుముఖం పట్టే సమయంలో పర్యాటకుల నుంచి ఆ టికెట్ తీసుకుని, దాన్నే తర్వాతి వారికి ఇచ్చేస్తున్నారు. దీంతో నెలకు రూ.వేలల్లో ఏపీ టూరిజం ఆదాయానికి గండి పడుతుంది. నిర్వాహకులను ప్రశ్నిస్తే మా మేనేజర్ చెప్పినట్లుగానే టికెట్ ఇస్తున్నామని చెబుతున్నారు. దీనిపై మేనేజర్ రంజిత్‌ను వివరణ కోరగా.. అలాంటిదేమీ లేదని కొట్టిపారేస్తున్నారు. ఈ టికెట్ దందాపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని పర్యాటకులు కోరుతున్నారు.

అవే టికెట్లు.. మళ్లీ మళ్లీ వినియోగం

మేనేజర్ కనుసన్నల్లో వ్యవహారం?

టికెట్ రుసుం పక్కదారి..

ఇటీవల రుషికొండ తీరంలో బ్లూ ఫ్లాగ్ బీచ్ పేరిట కొత్తగా అభివృద్ధి చేశారు. దీనికి వెళ్లేందుకు బీచ్ సాత్ రోడ్డును అధికారులు ప్రారంభించారు. అందమైన బీచ్ వ్యూను ఆస్వాదించేందుకు పర్యాటకులు ఎక్కువగా మక్కువ చూపిస్తున్నారు. కేవలం కార్లకు మాత్రమే అనుమతి ఇవ్వడంతో రోజూ వందలాది కార్ల రాకపోకలు సాగుతున్నాయి. ఇక్కడి బీచ్ నిర్వహణ, మరింత అభివృద్ధి కోసం ప్రతి వాహనానికి రూ.50 ప్రవేశ రుసుముగా ఏపీ టూరిజం అధికారులు నిర్ణయించారు. ఇక్కడ వరకు బాగానే ఉంది. అయితే దీన్ని అదనుగా తీసుకున్న మేనేజర్ నిర్వాహకులతో కుమ్మక్కై వసూళ్లను పక్కదారిపట్టించడమే ఆరోపణలకు తావిస్తోంది. ఒక వేళ ఎవరైనా పర్యాటకులు ఇదేంటని ప్రశ్నిస్తే మీరేం చేస్కుంటారో.. చేసుకోండంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు.



పర్యాటకులపై రుబాబు చేస్తున్న సూపర్‌వైజర్ జగదీష్

ఖైదీలకు ఈ–ములాఖత్

- విశాఖ కేంద్ర కారాగారంలో ఏర్పాట్లు
- త్వరలో ప్రారంభానికి సన్నాహాలు
- ఆన్‌లైన్ బుకింగ్ ఇప్పటికే అందుబాటులోకి..



వీడియోకాల్ కోసం సిద్ధం చేసిన కంప్యూటర్లు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో ఈ–ములాఖత్ కోసం సర్వం సిద్ధం చేశారు. ఇందుకోసం జైలు **అధికారులు ప్రత్యేకంగా** వెబ్‌సైట్ రూపొందించారు. **ఆ వెబ్‌సైట్ ద్వారా ము**లాఖత్ కోసం ఖైదీల **బంధువులు ముందుగా స్లాట్** బుక్ చేసుకోవచ్చు. **సమయం, శ్రమ వృథా కాకుం**డా ఈ విధానం ఉపయోగపడుతుందని **అధికారు**లు భావిస్తున్నారు. **అలాగే ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్** వల్ల ములాఖత్‌కు **వచ్చినవారు జైలు వద్ద గంటల** తరబడి క్యూలో ఉండాల్సిన **అవసరం ఉండ**దని అంటున్నారు. **ప్రస్తుతం ములాఖత్ కోసం** వచ్చినవారితో జైలు **ద్వారం వద్ద పెద్ద క్యూ ఏర్పడు**తుంది. సోమ, మంగళవారాల్లో **సుమారు 250 మం**ది వరకు ఖైదీల బంధువులు, **స్నేహితులు ములాఖ**త్‌కు వస్తుంటారు.

వీడియో కాల్ ద్వారా..

ఈ–ములాఖత్ ద్వారా వీడియో కాల్ అవకాశం **కల్పిస్తున్నారు. ఈ సౌకర్యం 2,** 3 రోజుల్లో అందుబా**టులోకి రానుంది. దీని కోసం** జైల్లోని ఓ క్యాబిన్‌లో సోమవారం ప్రత్యేకంగా మూడు కంప్యూటర్లు ఏర్పాటు చేశారు. ఈ–ములాఖత్ ద్వారా ఆన్‌లైన్‌లో ముందుగా స్లాట్ బుక్ చేసుకున్నవారికి ఆయా ఖైదీలతో వీడియో కాల్ ద్వారా మాట్లాడే అవకాశం కల్పిస్తారు. దీని ద్వారా ఒక్కో ఖైదీ వారి బంధువులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు ఎంతమందితోనైనా 30 నిమిషాల పాటు మాట్లాడుకోవచ్చు. వారు మాట్లాడినంత సేపు జైలు సిబ్బంది పర్యవేక్షణ చేస్తుంటారు.

ఆన్‌లైన్ బుకింగ్ : ములాఖత్‌కు ఆన్‌లైన్ ద్వారా కూడా ముందుగా బుక్ చేసుకోవచ్చు. ఇందుకు eprison.nic.in వెబ్‌సైట్ అందుబాటులో ఉంది. ఈ వెబ్‌సైట్ ఓపెన్ చేసి ఖైదీ పేరు, వివరాలు, కలవాల్సిన వారి వివరాలు, ఈ మెయిల్ ఐడీ, ఫోన్ నంబరు నమోదు చేయాలి. ఎంటర్ కొట్టిన అనంతరం స్లాట్ బుక్ అవుతుంది. బుక్ చేసినవారి ఫోన్‌కు మెసేజ్ వస్తుంది. దాన్ని బట్టి ఖైదీల బంధువులు, స్నేహితులు ములాఖత్‌కు జైలు వద్దకు నేరుగా వెళ్లవచ్చు. దీంతో పాటు ఎప్పటిలాగే సాధారణ బుకింగ్ కౌంటర్ కూడా జైలు ద్వారం వద్ద అందుబాటులో ఉంటుంది. ఇక్కడ నేరుగా ఆధార్ చూపించి ములాఖత్‌కు వెళ్లవచ్చు. రిమాండ్ ఖైదీలకు వారంలో 2 సార్లు, శిక్షపడిన ఖైదీలకు రెండు వారాల్లో రెండుసార్లు ములాఖత్ అవకాశం ఉంటుంది. ఒక ములాఖత్‌లో ముగ్గురు పెద్దలకు మాత్రమే అవకాశం ఉంటుంది.

ఈ–ములాఖత్‌తో సౌకర్యం



ఖైదీల బంధువులకు ఈ–ములాఖత్‌తో సౌకర్యంగా ఉంటుంది. ఈ–ములాఖత్‌లో వీడియో కాల్ ద్వారా ఒక ఖైదీ 30 నిమిషాల పాటు వారి కుటుంబ సభ్యులతో మాట్లాడుకోవచ్చు. దీన్ని 2, 3 రోజుల్లో ప్రారంభిస్తాం. ఇందుకు మూడు కంప్యూటర్లు సిద్ధం చేశాం. సోమవారం డెమో కూడా నిర్వహించాం.

– ఎస్.సాయిప్రవీణ్, జైల్ డిప్యూటీ సూపరింటెండెంట్

స్టాఫ్ నర్సుల ప్రొవిజినల్ జాబితా విడుదల

మహారాణిపేట: స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీలో భాగంగా అభ్యర్థుల ప్రొవిజినల్ జాబితా వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రాధారాణి విడుదల చేశారు. వెబ్‌సైట్ https@//nagendrasvst.wordpress.comలో స్టాఫ్ నర్సుల ప్రొవిజనల్ జాబితాను పొందుపరిచారు. ఈ జాబితాపై మూడు రోజుల పాటు అభ్యంతరాల స్వీకరణకు గడువు ఇచ్చారు. అభ్యర్థులు అభ్యంతరాలను రేసపువానిపాలెంలో ఉన్న వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయంలో అందజేయాలని, వాటిని పరిశీలించి, మెరిట్ లిస్టు విడుదల చేస్తామని ఆర్‌డీ వివరించారు. ఉత్తరాంధ్రలో 106 పోస్టులకు గాను మొత్తం 8,300 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.

టూరిజంలో విస్తృత అవకాశాలు

పెట్టుబడిదారులకు వివరించిన మూడు జిల్లాల కలెక్టర్లు



అరకు చలి ఫెస్టివల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్, ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్‌జైన్, ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి, జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తదితరులు

సాక్షి, విశాఖపట్నం : పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఉమ్మడి విశాఖ జిల్లాలో విస్తృతమైన అవకాశాలు, వనరులు ఉన్నాయని ఆయా జిల్లాల కలెక్టర్లు స్పష్టం చేశారు. నగరంలో నిర్వహించిన టూరిజం రీజనల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌ను టూరిజం మంత్రి కందుల దుర్గేష్, పర్యాటక శాఖ కార్యదర్శి అజయ్‌జైన్, ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ బాలాజీతో పాటు కలెక్టర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా విశాఖ జిల్లాలో ఉన్న టూరిజం అవకాశాలపై కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ఇన్వెస్టర్లతో కలిసి పనిచేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. యారాడ, భీమిలి, సాగర్‌నగర్ బీచ్‌లతో పాటు బీచ్ ఫ్రంట్‌ను అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అరకులో త్వరలోనే సీప్లేన్ ట్రయల్ రన్ నిర్వహిస్తామన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ మాట్లాడుతూ అరకు మొదలుకొని లంబసింగి, మారేడుమిల్లి వరకు సహజ ప్రకృతి సౌందర్య ప్రదేశాలన్నింటిని కలిపి సర్క్యూట్‌గా చేస్తే పర్యాటకులను ఆకర్షించవచ్చన్నారు. మేఘాలయ, మిజోరాంలా అరకును సదరన్ రీజినల్ కల్చర్ హబ్‌గా చేస్తే బాగుంటుందని సూచించారు. ఈనెల 31 నుంచి జరిగే అరకు చలి ఉత్సవ్‌లో ఈ ప్రాంతంలోని కల్చర్‌ను, పర్యాటకంగా అభివృద్ధికి ఉన్న అవకాశాలను వివరిస్తామని తెలిపారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్‌కృష్ణన్ మాట్లాడుతూ జిల్లాలోని తంతడి, సీతపాలెంలో బీచ్ ఫ్రంట్ టూరిజాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది.. స్థానికంగా 80 ఎకరాల ప్రభుత్వ స్థలం ఉన్నప్పటికీ పర్యాటకులకు అవసరమైన రిసార్ట్స్‌లు, మౌలిక వసతులు లేవన్నారు. ఇన్వెస్టర్లు ఈ ప్రాంతంలో పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ సదస్సులో జీసీసీ ఎండీ కల్పనాకుమారి, ఏపీటీడీసీ ఈడీ పద్మావతి, జిల్లా టూరిజం అధికారి జ్ఞానవేణి, ఏపీటీటీఏ అధ్యక్షుడు విజయ్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సదస్సులో అరకు కాఫీ, డెస్టినేషన్ వెడ్డింగ్‌లు–మైస్ (మీటింగ్‌లు, ప్రోత్సాహకాలు, సమావేశాలు, ప్రదర్శనలు), అడ్వెంచర్ టూరిజం రంగాలపై చర్చలు జరిగాయి.

ఊరూరా... బెల్ట్ జోరు..!

'ఎస్.రాయవరం మండలంలోని గుడివాడ గ్రామంలో ఉన్న మద్యం షాపు నుంచి బంగారుపాలెం బెల్టు షాప్‌నకు భారీగా మద్యం ఆటోలో తరలిస్తుండగా స్థానికులు అడ్డుకుని లా అండ్ ఆర్డర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్.రాయవరం ఎస్‌ఐ విభీషణరావు కేసు నమోదు చేశారు. స్థానిక టీడీపీ నాయకులు, హోంమంత్రి పీఏగా పనిచేసి సస్పెన్షన్ గురైన వ్యక్తి వాటాదారులుగా ఉన్న మద్యం షాపు నుంచి బెల్టు షాపులకు మద్యం తరలిస్తుండగా స్థానికులు అడ్డుకుని పోలీసులకు అప్పగించారు. ఇందులో రూ.3 లక్షల విలువైన 47 కేసులకు పైగా మద్యం ఉన్నట్టు సమాచారం. అయితే 30 కేసులకు పైగా ఉంటే వెంటనే లైసెన్స్ రద్దు చేయాలనేది ఎక్సైజ్ పాలసీ విధానం. ఎస్.రాయవరం మండలం బంగారమ్మపాలెంలో గ్రామ జాతర ఉండడంతో అధిక మొత్తంలో బెల్టు షాపులకు మద్యం తరలించినట్టు సమాచారం.'



గుడివాడలో బెల్టు షాపులకు ఆటోలో తరలిస్తుండగా పట్టుబడిన మద్యం

- అనకాపల్లి జిల్లాలో అనధికారికంగా సుమారు 200 బెల్టు షాపులు
- హోంమంత్రి నియోజకవర్గంలోనే 40కు పైగా నిర్వహణ
- బెల్టు షాపులకు తరలిస్తున్న 40 కేసులను పట్టుకున్న స్థానికులు

సాక్షి, అనకాపల్లి: కూటమి ప్రభుత్వం కొత్త మద్యం పాలసీతో జిల్లాలో మద్యం ఏరులైపారుతోంది. గత అయిదేళ్లుగా మూతపడిన బెల్టు షాపులు మళ్లీ పల్లెల్లో విచ్చలవిడిగా తెరుచుకున్నాయి. స్థానిక కూటమి ప్రజాప్రతినిధుల అండతో సిండికేట్ వ్యాపారుల కనుసన్నల్లో బెల్టు షాపులు ఎక్కడికక్కడ పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. లాటరీ ద్వారా మద్యం షాపులు దక్కించుకున్న సిండికేట్లు, ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా గుట్టుచప్పుడు కాకుండా అనధికారికంగా బెల్టుషాపులకు ఆజ్యం పోస్తున్నారు. హోంమంత్రి వంగలపూడి అనిత సొంత నియోజకవర్గంలో రూ.3 లక్షల నుంచి రూ.11 లక్షల వరకూ వేలం పాట ద్వారా బెల్టు షాపులు బహిరంగంగా ఏర్పాటు చేస్తున్నారు. మంత్రి అనుచరులే ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇందులో సగం వాటా స్థానిక కూటమి ప్రజాప్రతినిధులకు, మిగిలిన వాటిలో మద్యం దుకాణదారులకు 30 శాతం, ఎక్సైజ్ శాఖ అధికారులకు 20 శాతం కమీషన్ ఇస్తున్నట్టు సమాచారం. జిల్లాలో పాయకరావుపేట, కోటవురట్ల, ఎస్.రాయవరం, నర్సీపట్నం, చోడవరం, యలమంచిలి, సబ్బవరం వంటి ప్రాంతాల్లో పుట్టగొడుగుల్లా అనధికారికంగా బెల్టు షాపులు ఏర్పాటు చేశారు. వీటిలో కొన్ని వేలం పాట ద్వారా డబ్బులు చెల్లించి అమ్మకాలు చేస్తుంటే..మరికొన్ని మద్యం సిండికేట్లే తమ అనుచరులు, బంధువుల ద్వారా అమ్మకాలు చేస్తున్నారు. ఒక్కో మద్యం బాటిల్‌పై రూ.20 నుంచి రూ.30 వరకూ అదనంగా అమ్ముతున్నారు.

ఏరులై పారుతున్న మద్యం..

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల పరవాడ పర్యటనలో బెల్టు షాపులు పెట్టినవారి బెల్టు తీస్తానని బహిరంగంగా చెప్పినా..బెల్టు షాపులు వెలుస్తున్నాయంటే కూటమి ప్రభుత్వం వాగ్దానాలు అంతంత మాత్రమే అని జనం చర్చించుకుంటున్నారు. 2014 నుంచి 2019 మధ్య జిల్లాలో మద్యం విక్రయాలు ఇష్టానుసారంగా జరిగేవి. ఒక్కో వైన్‌షాప్ ఆధీనంలో 4 నుంచి 8 వరకు బెల్టు షాపులు నిర్వహించేవారు.

అనధికార వేలం.. లాభసాటి బేరం

జిల్లాలో 136 మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటిలో గతంలో కంటే అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తున్నారు. బెల్టు షాపుల్లో ఒక్కో బాటిల్‌పై రూ.20 నుంచి రూ.30 అదనంగా అమ్ముతున్నారు.

అర్జీలకు సంతృప్తికర పరిష్కారం



వినతులు స్వీకరిస్తున్న జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చిన అర్జీలను వెంటనే ఓపెన్ చేసి, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, పునరావృతం కాని విధంగా పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ జిల్లా అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్ కార్యక్రమం సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. అర్జీలు స్వీకరిస్తూ, సంబంధిత అధికారులకు జేసీ ఎండార్స్ చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వర్మ, హౌసింగ్ పీడీ సత్తిబాబు వినతులు స్వీకరించారు. మొత్తం 264 వినతులు రాగా..వాటిలో రెవెన్యూ శాఖకు 130, పోలీసు శాఖకు15, జీవీఎంసీకి 59 ఉన్నాయి. అలాగే ఇతర విభాగాలకు సంబంధించి 60 వినతులు వచ్చాయి. వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్నారు.

గోస్తనీనదిలో దూకిన విద్యార్థిని

- రక్షించిన స్నేహితులు

తగరపువలస: స్థానిక జాతీయరహదారిపై గల వంతెనపై నుంచి సోమవారం గోస్తనీనదిలో దూకిన ఇంటర్ ఫస్టియర్ విద్యార్థినిని స్నేహితులు రక్షించారు. భోగాపురం మండలం ఒనుముపేటకు చెందిన విద్యార్థిని తల్లిదండ్రులకు అనారోగ్య సమస్యల కారణంగా మనస్తాపంతోఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు స్నేహితులు తెలిపారు. ప్రస్తుతం విద్యార్థిని క్షేమంగా ఉన్నట్టు భీమిలి పోలీసులు తెలిపారు. ఈమె తగరపువలసలోని ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతోంది.

టౌన్ ప్లానింగ్‌పైనే అధిక ఫిర్యాదులు

- జీవీఎంసీ 'పీజీఆర్ఎస్'కు 58 వినతులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ గొలగాని హరి వెంకటకుమారి

డాబాగార్డెన్స్ : జీవీఎంసీ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కు 58 వినతులు అందినట్టు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో అదనపు కమిషనర్ డీవీ రమణ మూర్తితో కలిసి పీజీఆర్ఎస్‌ను సోమవారం నిర్వహించారు. అందిన వినతుల్లో జోన్-2 నుంచి 9, జోన్-3 నుంచి 11, జోన్-4 నుంచి 5, జోన్-5 నుంచి 5, జోన్-6 నుంచి 11, జోన్-8 నుంచి 10 ఫిర్యాదులు అందగా జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సంబంధించి 7 ఫిర్యాదులు అందాయని మేయర్ తెలిపారు. వచ్చిన 58 వినతుల్లో పట్టణ ప్రణాళికా విభాగానికి 35 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

- నా పేరు శంకర్‌దాస్. మధురవాడ ఉజ్వల ఆస్పత్రి సమీపంలో నివాసం ఉంటున్నా. ఇటీవలే ఇల్లు నిర్మించుకున్నా. సర్వేయర్ వచ్చి కొలతలు వేశాడు. ఇంత వరకూ ఇంటి పన్ను విధించలేదు. ఇంటి పన్ను ఉంటేనే కుళాయి కనెక్షన్ ఇస్తారంటా..అందుకు సంబంధిత సిబ్బందికి ఎంతో కొంత ముట్టజెప్పాలంటా.. వృద్ధాప్యంలో ఉన్నా.. పలుమార్లు జీవీఎంసీ చుట్టూ తిరగలేని పరిస్థితి. నా భార్య క్యాన్సర్‌తో బాధపడుతోంది..అధికారులు స్పందించి న్యాయం చేయాలని అర్జీ సమర్పించాడు.
- జీవీఎంసీ 97వ వార్డు ఏకలవ్య కాలనీకి చెందిన ఎరుకుల కులస్థులం. తరాలుగా పందుల పెంపకాన్ని జీవనోపాధిగా చేసుకుని బతుకుతున్నాం. 2015 వరకు మా పందుల గూళ్లు మా గ్రామంలోనే ఉండేవి. నీళ్లు పెట్టి..మేత వేసుకోవడానికి అనువుగా ఉండేది. అప్పటి జోనల్ కమిషనర్ పందుల పెంపకందార్లను పిలిచి పందుల గూళ్ల స్థానంలో ప్రభుత్వ ఆస్పత్రి కట్టాలి. మీరు పందుల గూళ్లు మార్చుకుని నల్ల క్వారీ వద్ద పెంపకం చేసుకుంటే రుణాలు అందజేయడమే కాకుండా ప్రభుత్వం నుంచి సహకారమందిస్తామని చెప్పారు. జోనల్ కమిషనర్ సూచనల మేరకు చినముషిడివాడ శివారు ప్రభుత్వ భూమి సర్వే నంబరు 197కి మార్చుకున్నాం. పెంపక ప్రాంతానికి రక్షణ గోడ, మౌలిక సదుపాయాలు కల్పించాలని జీవీఎంసీని కోరాం. సరైన సదుపాయం లేక పందులు చనిపోవడం, దొంగతనాలు జరగకుండా ఉండేందుకు అప్పటి కమిషనర్ హరినారాయణ్ ప్రహరీ నిర్మిస్తామన్నారు. ప్రహరీ ఏర్పాటు చేయకపోవడం..మంచినీటి సౌకర్యం లేకపోవడంతో పందులు చనిపోతున్నాయి. దొంగతనాలు జోరుగా సాగుతున్నాయంటూ పందుల పెంపకందార్లు వినతి పత్రం సమర్పించారు.
- జోన్-8లో అడ్డూఅదుపు లేకుండా అనధికార నిర్మాణాలు జరుగుతున్నాయని చాలా మంది మేయర్, అధికారుల దృష్టికి తీసుకొచ్చారు.
- జోన్-3 పరిధి 14వ వార్డులో జీవీఎంసీ పట్టణ ప్రణాళికా విభాగం ఎటువంటి నోటీసులు ఇవ్వకుండానే ఆంజనేయ స్వామి ఆలయాన్ని కూల్చివేశారని, జీవీఎంసీ పరిధిలో ఎన్నో అక్రమాలు, అనధికార కట్టడాలు జరుగుతున్నా..ఆర్అండ్‌బీ స్థలంలో నిర్మించిన ఆలయాన్ని గత శుక్రవారం జోన్-3 టౌన్‌ప్లానింగ్ సిబ్బంది కూల్చి వేశారని పలువురు అధికారులకు వినతి పత్రం సమర్పించారు.

ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న డీసీపీ-1 అజితా వెజెండ్ల

విశాఖ సిటీ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని డీసీపీ-1 అజితా వెజెండ్ల పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 79 ఫిర్యాదులు వచ్చాయి. డీసీపీ-1తో పాటు డీసీపీ-2 మేరీ ప్రశాంతి ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిపై సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి సమస్యల పరిష్కారానికి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని చెప్పారు.

బ్రెడ్ తింటూ.. బాత్ రూమ్ నీరు తాగుతూ..

- విదేశంలో ఉద్యోగం కోసం వెళ్లిన వారు అక్కడ నరకయాతన
- నకిలీ అగ్రిమెంట్లు, నకిలీ వీసాలతో విదేశాలకు పంపించిన 'నూజ్'కన్సల్టెన్సీ
- అవి చెల్లవని చింపేసిన అక్కడి ఏజెంట్
- అక్కడి నుంచి వచ్చి విశాఖ పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

విశాఖ సిటీ: రోజూ రెండు బ్రెడ్లు కోసం పది మంది కొట్టుకుంటూ.. బాత్‌రూమ్‌లో నీటినే తాగుతూ.. నెలల తరబడి నరకయాతన అనుభవించారు. విదేశాల్లో వేర్‌హౌస్ కంపెనీలో సూపర్‌వైజర్ ఉద్యోగం వచ్చిందని కోటి ఆశలతో విమానం ఎక్కిన నిరుద్యోగులతో అక్కడ బాత్‌రూమ్‌లు కడిగించారు. తోటల్లో గడ్డి కత్తిరిస్తూ.. కూలి పనులు చేయించారు. ఆకలి బాధలు తట్టుకోలేక.. ఉత్తరాంధ్రకు చెందిన 25 మంది తిరిగి విశాఖకు చేరుకొని నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. వారు చెప్పిన వివరాల ప్రకారం.. యూరప్‌లోని పలు దేశాల్లో వేర్ హౌస్‌లో స్టోర్ కీపర్, సూపర్‌వైజర్ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ 2023లో నూజ్ కెరీర్ ఓవర్సీస్ కన్సల్టెన్సీ వారు పత్రికల్లో ప్రకటనలు ఇచ్చారు.

క్యాబ్ డ్రైవరే కంపెనీ ఓనర్ అని..

విదేశాల్లో ఉద్యోగం వస్తుందని భావించిన పలువురు నిరుద్యోగులు సదరు కన్సల్టెన్సీ ప్రతినిధులను సంప్రదించారు. వీరికి నగరంలోని ఓ హోటల్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. అందులో యూరప్‌లోని ఒక ట్యాక్సీ డ్రైవర్‌ను తీసుకువచ్చి కంపెనీ ఓనర్‌గా నిరుద్యోగులకు పరిచయం చేశారు. అతని కంపెనీలోనే పనిచేయాల్సి ఉంటుందని, అతడే అందరికీ జీతాలు ఇస్తాడని నమ్మించారు.

10 మందికి రెండు బ్రెడ్లే..

జీవితంలో స్థిరపడవచ్చన్న ఆశతో విమానం ఎక్కిన నిరుద్యోగులు అక్కడికి వెళ్లాక నరకయాతన అనుభవించారు. అగ్రిమెంట్ ప్రకారం సదరు కంపెనీకి వెళ్లగా.. అవి ఉద్యోగానికి సంబంధించినవి కాదని, నకిలీవని ఆ ఒప్పంద పత్రాలను చింపేశారు. వారిని ఒక లేబర్ క్యాంప్‌నకు తరలించారు. అక్కడ ఓ చిన్న రూమ్‌లో పది మంది చొప్పున ఉంచారు. స్టోర్‌కీపర్, సూపర్‌వైజర్ ఉద్యోగాలు కాకుండా బాత్‌రూమ్‌లు కడిగించారు. అలాగే పొలాల్లో గడ్డి తీయడం, పండ్లు కోసే పనులు చేయించారు. రూమ్‌లో పది మంది ఉంటే.. రోజుకు కేవలం రెండు బ్రెడ్లు మాత్రమే పంపించేవారు. దీంతో ఆకలి తీర్చుకోడానికి ఆ బ్రెడ్ల కోసం కొట్టుకునేవారు. తాగడానికి నీరు లేక బాత్‌రూమ్‌లో నీటినే తాగేవారు. ఇలా కొద్ది నెలలు తీవ్ర ఇబ్బందులు పడి, ఇక ఉండలేక అతికష్టం మీద తిరిగి విశాఖకు చేరుకున్నారు. నూజ్ కన్సల్టెన్సీ ప్రధాన కార్యాలయం కర్ణాటక రాష్ట్రంలోని బెలగావిలో ఉన్నట్లు గుర్తించారు. అక్కడ కన్సల్టెన్సీ మేనేజింగ్ డైరెక్టర్ మొహిసిన్ అహ్మద్‌షేక్‌ను సంప్రదించారు. దీంతో అతడు మరి కొద్ది రోజుల్లో ఇటలీ, చెక్‌రిపబ్లిక్, ఇతర దేశాలకు పంపిస్తానని హామీ ఇచ్చాడు. ఆ తరువాత కన్సల్టెన్సీ ప్రతినిధులను సంప్రదించడానికి ప్రయత్నించినప్పటికీ.. వారు స్పందించలేదు. ఫిర్యాదు చేస్తే చేసుకోవచ్చని చెప్పడంతో బాధితులు సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో జరుగుతున్న పీజీఆర్ఎస్ కార్యక్రమంలో పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

ఒక్కొక్కరి నుంచి రూ.7.5 లక్షలు వసూలు

ఈ ఉద్యోగాల కోసం ఒక్కొక్కరి నుంచి రూ.7.5 లక్షలు నుంచి రూ.8 లక్షలు వసూలు చేశారు. ఇలా ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి 25 మంది వరకు డబ్బులు కట్టారు. అయితే నెలలు గడుస్తున్నా వారిని విదేశాలకు పంపించలేదు. దీంతో వారు కన్సల్టెన్సీ ప్రతినిధులపై ఒత్తిడి పెంచారు. ఆరు నెలల తరువాత నకిలీ అగ్రిమెంట్లు, నకిలీ వీసాలతో దక్షిణ యూరప్‌లోని మాంటెనెగ్రో దేశానికి పంపించారు.

ఉద్యోగాల పేరుతో తల్లీకొడుకు మోసం

- ఏయూలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగులకు వల
- నలుగురు యువకుల నుంచి రూ.32 లక్షల వసూలు
- భర్త మృతి చెందడంతో ఏయూలో అసిస్టెంట్ లైబ్రేరియన్‌గా ఉద్యోగం
- గుర్తింపు కార్డు అడ్డం పెట్టుకుని మోసాలు
- ఇటువంటి కేసులో ఇప్పటికే సస్పెండైన నిందితురాలు సత్య
- పోలీసుల అదుపులో తల్లీకొడుకు



నిందితులు దినేష్, సత్య

ఎంవీపీకాలనీ : ఏయూ ఉద్యోగైన భర్త మృతి చెందడంతో ఆ ఉద్యోగం భార్యకిచ్చారు. ఎంతో బాధ్యతగా వ్యవహరించాల్సిన ఆ మహిళ మోసాలకు పాల్పడడం అలవాటు చేసుకుంది. ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగులను టార్గెట్ చేసింది. ఈ వ్యవహారంలో తన కుమారుడే కీలక పాత్ర పోషించడం కొసమెరుపు. చివరకు బాధితుల ఫిర్యాదుతో వారిద్దర్నీ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు...

చెందిన సత్య..దినేష్ తల్లీకొడుకులు. ఎంవీపీ కాలనీ సెక్టార్-6లో నివాసం ఉంటున్నారు. సత్య భర్త ఏయూలో ఉద్యోగి. కొంతకాలం క్రితం ఆయన మృతి చెందగా ఆ ఉద్యోగం ఆమెకు ఇవ్వగా.. అసిస్టెంట్ లైబ్రేరియన్‌గా విధులు నిర్వహిస్తోంది. కొమ్మోజు శివకుమార్, అతని సోదరుడు రోహిత్‌కుమార్‌లు ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నారు. వీరి స్నేహితుడు పృథ్వీతేజ్ ద్వారా దినేష్ పరిచయమయ్యాడు. ఈ క్రమంలో తన తల్లి సత్య ఏయూలో ఉద్యోగని, ఇప్పటికే పలువురికి ఉద్యోగాలు ఇప్పించిందని నమ్మబలికాడు. పైగా ఇంటికి తీసుకువెళ్లి తల్లిని పరిచయం చేశాడు. ఏయూలో అసిస్టెంట్ లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న గుర్తింపు కార్డును కూడా శివకుమార్, రోహిత్‌లకు చూపించడంతో నమ్మకం కుదిరింది. ఏయూలో ఉద్యోగం కోసం ఒక్కొక్కరూ రూ.15 లక్షలు చెల్లించాలని చెప్పడంతో అన్నదమ్ములిద్దరూ అంగీకరించారు. ముందుగా కొంత నగదు ఇస్తామని, ఉద్యోగం వచ్చిన తరువాత మిగిలిన డబ్బులు చెల్లిస్తామని వారితో ఒప్పందం కుదుర్చుకున్నారు. అలాగే తమ స్నేహితులు రఘు, పృథ్వీ ఉన్నారని, వారికి కూడా ఉద్యోగాలు ఇప్పించాలని కోరారు. ఈ నేపథ్యంలో ఈ నలుగురు కలిసి 2023 నుంచి దఫదఫాలుగా సత్య, దినేష్‌లకు రూ.32 లక్షలు చెల్లించారు. అయితే కాలం గడుస్తున్నా ఆమె ఉద్యోగాలు ఇప్పించకపోవడంతో అనుమానం వచ్చి ఏయూ లైబ్రరీకి వెళ్లి విచారణ చేశారు. దీంతో అసలు విషయం బయటపడింది. భర్త చనిపోవడంతో సత్యకు ఉద్యోగం వచ్చిందని..అయితే ఆమె గతంలో ఉద్యోగాల పేరుతో మోసం చేస్తుండడంతో సస్పెండ్ అయినట్టు ఏయూ ఉద్యోగులు చెప్పడంతో తాము మోసపోయామని తెలుసుకున్నారు. దీంతో శివకుమార్, రోహిత్‌లు.. దినేష్‌ను నిలదీయగా స్పందించలేదు. దీంతో బాధితులు సోమవారం ఎంవీపీ పోలీసులను ఆశ్రయించారు. శివకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి తల్లీకొడుకులను అదుపులోకి తీసుకున్నారు. వీరితో పాటు చాలా మంది యువకులను వీరు మోసం చేసి ఉంటారని భావిస్తున్న పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక కిడ్నాప్ కేసులో రెండో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విష్ణు స్వరూప్. చిత్రంలో నిందితుడు సాయికుమార్

- 23 తులాల బంగారు ఆభరణాల స్వాధీనం

సబ్బవరం: మైనర్ బాలికను కిడ్నాప్ చేసిన వ్యక్తికి సహకరించిన కేసులో ఏ2 నిందితుడు, బాలిక ఇంట్లో బంగారు ఆభరణాల చోరీకి పాల్పడిన వ్యక్తిని సబ్బవరం పోలీస్‌లు అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు. పరవాడ సీఐ రమణతో కలిసి డీఎస్పీ వల్లె విష్ణుస్వరూప్ సోమవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. మండలంలోని జీవీఎంసీ పరిధి గంగవరం గ్రామానికి చెందిన బాలిక గతేడాది అక్టోబర్ 19న కిడ్నాప్‌కు గురైన విషయం తెలిసిందే. దీంతో పాటు రూ.15 లక్షల విలువైన 23 తులాల బంగారు ఆభరణాలు కూడా మాయమైనట్లు వచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ నెల 10న బాలికను ఇంటి వద్ద వదిలి పెట్టి తప్పించుకునేందుకు ప్రయత్నించిన ఏ1 నిందితుడు పతివాడ మహేష్‌ను అనకపల్లి జంక్షన్ వద్ద అరెస్ట్ చేసి, కోర్టుకు తరలించారు. కిడ్నాప్‌కు సహకరించిన ఆమె పెద్దమ్మ కొడుకు, ఏ2 నిందితుడు మాటూరి సాయికుమార్(26) కోసం వెతుకుతున్నారు. తిరిగి వచ్చిన బాలికను పోలీసులు ఆరా తీయగా ఇంట్లో మాయమైన 23 తులాల బంగారు ఆభరణాలను ఆమె తీసుకెళ్లలేదని తెలిపింది. దీంతో బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు ఈ నెల 12న సాయి కుమార్‌పై చోరీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో దొంగిలించిన నగలను సోమవారం సాయంత్రం సబ్బవరం ఎన్టీఆర్ జంక్షన్ వద్ద అమ్మకం/తాకట్టు పెట్టేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి నుంచి 23 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు సాయికుమార్‌పై గతంలో పోక్సో కేసు, ఐరెన్ దొంగతనంలో నిందితుడిగా ఉన్నాడు. దీంతో మొత్తం నాలుగు కేసులు నమోదైనట్లు డీఎస్పీ తెలిపారు. బాలిక కిడ్నాప్, బంగారు అభరణాల అపహరణ కేసులను చాకచక్యంగా ఛేదించిన సీఐ పిన్నింటి రమణ, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

ముగ్గురు దొంగల అరెస్ట్

- ఆరు చోరీ కేసుల్లో 182 గ్రాముల బంగారం, రూ.2.70 లక్షల స్వాధీనం
- వెల్లడించిన వెస్ట్‌జోన్ క్రైం ఏసీపీ లక్ష్మణరావు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ లక్ష్మణరావు

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో పలు ఇళ్లల్లో చోరీలతో పాటు దారి దోపిడీకి పాల్పడిన ముగ్గురు దొంగలను పెందుర్తి పోలీసులు అరెస్ట్ చేశారు. మరో దొంగ పరారీలో ఉన్నాడు. వారి వద్ద నుంచి 182 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.2.70 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో వెస్ట్ జోన్ క్రైం విభాగం ఏసీపీ డి.లక్ష్మణరావు వివరాలు వెల్లడించారు. నగరంలోని రైల్వే న్యూకాలనీకి చెందిన ఓ వ్యక్తి తన బ్యాగ్‌లో రూ.2.80 లక్షలు, తన కుమార్తె సర్టిఫికెట్లు తీసుకొని పురుషోత్తపురం బయలుదేరాడు. కృష్ణరాయపురం ఓ హోటల్ వద్దకు వచ్చేసరికి ఫోన్ మాట్లాడుదామని బైక్ ఆపాడు. ఆ సమయంలో అతనితో మాటలు కలిపిన దుండగులు బ్యాగ్ అపహరించుకుపోయారు. దాంతో పాటు పెందుర్తి, భవానీనగర్, పాపయ్యరాజుపాలెం ప్రాంతాల్లో ఐదు దొంగతనాలు జరిగాయి. ఆయా కేసుల్లో నిందితులు గుంటూరు జిల్లా బూరెలవారి వీధికి చెందిన పుల్లెట్టికుర్తి ఉమామహేశ్వరరావు అలియాస్ బుజ్జి, కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు మండలం రెడ్డిపల్లికి చెందిన మోదుగమూడి రమేష్, గోపాలపట్నం సమీపంలోని కొత్తపాలేనికి చెందిన కామాక కనకరాజులను అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడు నల్లమోతుల సురేష్ పరారీలో ఉన్నట్లు ఏసీపీ పేర్కొన్నారు. ఆయా కేసుల ఛేదనలో ప్రతిభ కనబరిచిన సీఐ ఎస్.శ్రీనివాసరావు, పెందుర్తి ఎస్ఐ డి.సూరిబాబు, ఏఎస్ఐ కె.వి.ఎస్.ఎన్ మూర్తి, హెచ్‌సీలు జి.నాగరాజు, ఎన్.భవాని, కానిస్టేబుళ్లను ఉన్నతాధికారులు అభినందించారు.

గుండెపోటుతో దువ్వాడ హెచ్‌సీ మృతి



రవి (ఫైల్)

అగనంపూడి: దువ్వాడ ట్రాఫిక్ పోలీస్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మన్నెం రవి సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. పాయకరావుపేటకు చెందిన రవి 1991 బ్యాచ్‌లో కానిస్టేబుల్‌గా ఎంపికై తరువాత పదోన్నతి పొందారు. ఇటీవలే దువ్వాడ పోలీస్టేషన్‌కు బదిలీపై వచ్చిన రవి సిబ్బంది అందరితో కలిసి మెలిసి సరదాగా, కలివిడిగా ఉండేవాడు. సోమవారం ఉదయం కూర్మన్నపాలెం ముస్తాఫా కూడలి నుంచి ద్విచక్రవాహనంపై విధులకు హాజరవుతుండగా, మార్గంమధ్యలో గుండెపోటు వచ్చింది. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అగనంపూడి ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో పోలీస్ సిబ్బంది దిగ్భ్రాంతికి గురయ్యారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు కాగా పెద్ద కుమార్తెకు వివాహం జరిగింది. మృతదేహాన్ని స్వస్థలం పాయకరావుపేట తరలించారు. మృతదేహానికి ఏసీపీ టి.త్రినాథ్, సీఐలు మల్లేశ్వరరావు, వెంకటరావు, ఎస్ఐలు, సిబ్బంది నివాళులర్పించారు.

మహిళపై దాడి కేసులో ఇద్దరు అరెస్టు

మధురవాడ: మహిళను జుట్టు పట్టుకుని ఈడ్చుకువెళ్లి గాయపరిచిన కేసులో ఇద్దర్ని అరెస్ట్ చేసినట్టు పీఎం పాలెం సీఐ బాలకృష్ణ సోమవారం తెలిపారు. మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ మాస్టర్‌ప్లాన్ రోడ్డులో బడ్డీల ఏర్పాటు, అద్దె వ్యవహారంలో ఇద్దరు మహిళల మధ్య చెలరేగిన వివాదంలో వాంబేకాలనీకి చెందిన ఎం.వెన్నెల, ఆమె భర్త రాజును అరెస్ట్ చేశారు. ఫిర్యాదు దారులైన నాగలక్ష్మి, వెన్నెల మధ్య తలెత్తిన వివాదం కొట్లాటకు దారి తీసింది. ఇందులో నాగలక్ష్మిని వెన్నెల జుట్టుపట్టుకుని ఈడ్చడంతో దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ మారింది. దీంతో వెన్నెలతోపాటు ఆమెకు సహకరించిన రాజును కూడా పోలీసులు అరెస్టు చేశారు. అలాగే వెన్నెలపై నాగలక్ష్మి దాడి చేసినందుకు కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనధికార లేఅవుట్లలో స్థలాలు కొనొద్దు

విశాఖ సిటీ: అనధికార లేఅవుట్లలో స్థలాలు కొనుగోలు చేసి ఇబ్బందులు పడొద్దని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ ఒక ప్రకటనలో సూచించారు. వీఎంఆర్‌డీఏ, ఇతర అధీకృత సంస్థ గుర్తింపు ఉన్న ప్లాట్లను మాత్రమే కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం మధ్య తరగతి ప్రజల కోసం వీఎంఆర్‌డీఏ ద్వారా ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌లను అభివృద్ధి చెసినట్లు చెప్పారు. జిల్లాలో రామవరం, పాలవలస, గంగసాని అగ్రహారం, అనకాపల్లి జిల్లాలో అద్దూరు, విజయనగరంలో గరివిడి ప్రాంతాల్లో ఉన్న టౌన్‌షిప్‌లలో 150, 200, 240 గజాల్లో ప్లాట్లు అన్ని మౌలిక సదుపాయాలతో అందుబాటు ధరల్లో ఉన్నాయని తెలిపారు.

నేటి నుంచి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్ మీట్

మురళీనగర్: రాష్ట్ర స్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. కంచరపాలెం పాలిటెక్నిక్ కళాశాల వేదికగా జరగనున్న పోటీలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పోటీలకు పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు సమన్వయాధికారిగా, డాక్టర్ బి.జానకీరామ్‌ను సహ సమన్వయాధికారిగా ప్రభుత్వం నియమించింది. ఆర్‌జేడీలు జె.సత్యనారాయణమూర్తి, నిర్మల్ కుమార్ ప్రియ పర్యవేక్షణలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 30 వరకు పోటీలు జరుగుతాయి. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల నుంచి 1,196 మంది క్రీడాకారుల పాల్గొంటారు. వీరిలో 476 మంది మహిళా క్రీడాకారులు, 720 మంది పురుష క్రీడాకారులు పాల్గొంటారని కన్వీనర్ డాక్టర్ కె.నారాయణరావు తెలిపారు. సోమవారం క్రీడారులు తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. పోటీలో తలపడాల్సిన టీములకు ఇప్పటికే డ్రా తీశారు. మంగళవారం ఉదయం 10 గంటలకు ఎంపీ శ్రీ భరత్ పోటీలు ప్రారంభిస్తారు. సాంకేతిక విద్యా శాఖ సంచాలకుడు గణేష్ కుమార్ చీఫ్ ప్యాట్రన్‌గా పాల్గొంటారు.

నేడు కేంద్ర ఉక్కు కార్యదర్శి రాక

ఉక్కునగరం: కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్ మంగళవారం విశాఖ స్టీల్‌ప్లాంట్ రానున్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా ఆయన సాయంత్రం స్టీల్‌ప్లాంట్‌కు చేరుకుంటారు. సాయంత్రం హిల్‌టాప్ గెస్ట్‌హౌస్ చేరుకొని విశ్రాంతి తీసుకుంటారు. బుధవారం ఉదయం ఉక్కు ప్రధాన పరిపాలన భవనంలో యాజమాన్యం అందజేసే ప్రజెంటేషన్ తిలకిస్తారు. అనంతరం స్టీల్‌ప్లాంట్‌లోని ఉత్పత్తి విభాగాలను సందర్శిస్తారు. సాయంత్రం ఉక్కు కార్మిక సంఘాలు, అధికారుల సంఘం, ఓబీసీ, ఎస్టీ, ఎస్సీ అసోసియేషన్ల నాయకులతో సమావేశమవుతారు. గురువారం కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామి స్టీల్‌ప్లాంట్ పర్యటనలోనూ ఉంటారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలి


- ప్రధానికి లక్ష పోస్టు కార్డుల బట్వాడా



లక్ష పోస్ట్ కార్డులను పోస్టు బాక్స్‌లో వేస్తున్న ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ కన్వీనర్ వీవీ రమణమూర్తి

సీతమ్మధార : తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక అయిన విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ కన్వీనర్ వీవీ రమణమూర్తి విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోస్టుకార్డు ఉద్యమంలో భాగంగా సేకరించిన లక్ష పోస్టుకార్డులను సోమవారం వెలమతోటలోని మెయిన్ పోస్ట్ ఆఫీస్‌లోని తపాలా అధికారికి అందజేశారు. కార్యక్రమానికి ముందుగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో రమణమూర్తి మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 10 లక్షల పోస్ట్ కార్డుల ఉద్యమాన్ని ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ ప్రారంభించిన విషయం తెలిసిందేనన్నారు. ఇందులో భాగంగా మొదటి విడతగా లక్ష పోస్ట్ కార్డులను ప్రధాని మోదీకి పోస్ట్ చేస్తున్నామన్నారు. ఇటీవల విశాఖ ఉక్కుకు రూ.11,440 కోట్లు భారీ ప్యాకేజీ ప్రకటించారని, ఇక పరిశ్రమను లాభాలు బాట పట్టించాల్సిన బాధ్యత విశాఖ ఉక్కు యాజమాన్యం, కార్మికులపైనే ఉందని, తమ బాధ్యత తీరిపోయినట్లుగా నేతలు ప్రకటనలు చేయడం సమస్యను పక్కదారి పట్టించడమేనన్నారు. స్టీల్ ప్లాంట్ లాభాల బాట పట్టాలంటే సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ ప్రజా మహిళా కార్మిక దళిత సంఘాల ప్రతినిధులు లలిత, డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, రవి, రాం ప్రభు, పీఓడబ్ల్యూఎస్ వెంకటలక్ష్మి, ఎల్ వరలక్ష్మి, ఎరుకలమ్మ, రూపా, కాంగ్రెస్ నాయకులు సోడదాసి సుధాకర్, ఐఎఫ్‌టీయూ గీత, శ్రీనివాసరావు, చిన్నారావు, బాలనాగమ్మ, రామారావు వాసు పాల్గొన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం



పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గిరిధర్

విశాఖ లీగల్ : రాజీమార్గమే రాజమార్గమని విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ అన్నారు. విశాఖ జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ సోమవారం న్యాయవాదులు, విశ్రాంత న్యాయమూర్తులకు 40 గంటల మధ్యవర్తిత్వం మార్గాలు అన్న అంశంపై నిర్వహించిన శిక్షణ శిబిరాన్ని న్యాయమూర్తి ప్రారంభించారు. వివిధ న్యాయస్థానాల్లో అపరిష్కృతంగా ఉన్న కేసుల విచారణ, కొత్త కేసులు పరిష్కరించడంలో మధ్యవర్తిత్వాన్ని ఎంచుకొని పరిష్కారానికి కృషి చేయాలని న్యాయవాదులను ఆయన కోరారు. విదేశాల్లో 90 శాతం కేసులు మధ్యవర్తిత్వ విధానంలోని పరిష్కరించబడుతున్నాయన్నారు. మన దేశంలో కూడా మధ్యవర్తిత్వం ద్వారా ఎక్కువ కేసులు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో చెన్నై నుంచి వచ్చిన మధ్యవర్తిత్వ జాతీయ శిక్షకులు రత్నతార, సత్యారావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకట శేషమ్మ పాల్గొన్నారు.

ఉక్కు దీక్షల టెంట్‌పై భిన్నాభిప్రాయాలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల టెంట్‌పై ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. సోమవారం ఆంధ్రకేసరి కళాక్షేత్రంలో జరిగిన పోరాట కమిటీ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించిన నేపథ్యంలో రిలే దీక్షల టెంట్ తొలగిద్దామని కొంతమంది ప్రతిపాదించారు. దీనిపై ప్రతిస్పందించిన కొన్ని కార్మిక సంఘాలు.. ఉక్కు ప్రైవేటీకరణ విరమిస్తామని కేంద్ర ప్రకటించేవరకు టెంట్ కొనసాగిల్సిందేనని తేల్చి చెప్పాయి. సుదీర్ఘంగా చర్చలు జరిగినప్పటికీ కార్మిక నేతలు ఏకాభిప్రాయానికి రాలేకపోయారు. కేంద్ర ఉక్కు కార్యదర్శి, కేంద్ర ఉక్కు మంత్రి పర్యటనల అనంతరం ఈ అంశంపై మరోసారి సమావేశమవ్వాలని నిర్ణయించారు. అదే విధంగా ప్యాకేజీ ప్రకటనను స్వాగతిస్తూ కూటమి నాయకులను కలిసి కృతజ్ఞతలు తెలపాలని నిర్ణయించారు. సమావేశంలో పోరాట కమిటీ చైర్మన్లు సీహెచ్.నర్సింగరావు, డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, కన్వీనర్ కె.ఎస్.ఎన్.రావు, కో కన్వీనర్ జె. అయోధ్యరామ్, నీరుకొండ రామచంద్రరావు, యు.రామస్వామి, రమణమూర్తి, డి.వి.రమణారెడ్డి, బొడ్డు పైడిరాజు, సురేష్‌బాబు, రామ్మోహన్‌కుమార్, వరసాల శ్రీనివాస్, సన్యాసిరావు, జి.ఆర్.కె. నాయుడు, గణపతిరెడ్డి, పల్లా పెంటారావు, జెర్రిపోతుల ముత్యాలు పాల్గొన్నారు.